**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**విజయవాడ,**
**తేదీ : డిసెంబర్ 28, 2016.**

**శ్రీయుత నారా చంద్రబాబునాయుడు గారికి**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము,
విజయవాడ.

**ప్రచురణార్థం:** ఈరోజు సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాను. **– జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

**విషయం : చేపలు, రొయ్యల చెరువుల అక్రమ త్రవ్వకాలను నివారించాలని, పర్యావరణాన్ని కాపాడాలని కోరుతూ...**

**ఆర్యా!**

తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో వేలాది ఎకరాల్లో నిబంధనలకు విరుద్ధంగా చేపల, రొయ్యల చెరువులు త్రవ్వుతున్నారు. ఈ ప్రక్రియ విచ్చలవిడిగా పెరగడంతో పర్యావరణ సమస్య తీవ్రమై వీటికి వ్యతిరేకంగా రైతులు ఆందోళనలకు దిగుతున్నారు. కృష్ణా జల్లా నందివాడ మండలంలో 35 వేల ఎకరాలు సాగులో వుంటే దానిలో 30 వేల ఎకరాలు ఆక్వా సాగులోకి వచ్చింది. తలసరి ఆదాయం, వృద్ధిరేటు పెంపు పేరుతో స్వయంగా ప్రభుత్వమే చట్టాలకతీతంగా ఆక్వా సాగును ప్రోత్సహిస్తుండడంతో ఈ విపరీత పరిస్థితి నెలకొన్నది. ఆక్వా సాగుని అదుపు చేయడానికి అనేక నిబందనలు ఎప్పటినుండో అమలులో వున్నాయి. తక్కువ ఉత్పాదకత ఉన్న భూములు, పడావు భూములు, ముంపుకు గురయ్యే భూములు, లోతట్టు భూములు మాత్రమే ఆక్వా చెరువులుగా మార్చుకోవచ్చు. 2013లో జి.వో.లు నెం. 7, 15ల ప్రకారం మంచినీటి వనరులకు, పంట కాలువలకు సమీపంలో చేపల, రొయ్యల చెరువులను అనుమతించరాదు. సారవంతమైన రెండు పంటలు పండే భూముల్లో చెరువులు త్రవ్వకూడదు. ఈ నిబందనలన్నింటిని పాటించకుండా చెరువులు విస్తరించడంతో నూటికి 85 శాతంగా వున్న సన్నకారు, చిన్నకారు రైతుల భూములన్నీ లీజు పేరుతో భూస్వాముల స్వాధీనంలోకి వెళ్ళిపోయాయి. అసైన్డ్ భూములు, ఊరుమ్మడి భూములు, ప్రభుత్వ భూములు, ఆఖరకు కాలువకట్టల భూములు, పంటకాలువలు అన్నీ ఆక్వా చెరువులుగా మారిపోయాయి. వ్యవసాయ కార్మికులకు గతంలో వలే వరి సాగులో వచ్చిన పని దినాలు ఆక్వా చెరువుల్లో లభ్యంగాక ఉపాధి సమస్య ఎదుర్కొంటున్నారు. పెద్దసంఖ్యలో ఉపాధికోసం వ్యవసాయ కార్మికులు వలసలు పోతున్నారు.

అధికార పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర భూస్వాములు ఈ ప్రక్రియలో ముందున్నారు. అసైన్డ్ భూములు కలిగిన దళితులు, సన్నకారు, చిన్నకారు రైతులు బలైపోతున్నారు. గత్యంతరంలేక పెద్దలకు తమ భూములను కౌలుకు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ భూములు చౌడు తేలడం వలన మళ్ళీ వరి సాగుచేయడం సాధ్యంగాదు. రొయ్యల చెరువులనుండి వచ్చే నీరు మరింత కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. వైరస్, ఇతర కారణాలతో చెరువుల యజమానులు అర్ధరాత్రుల్లో నీటిని పంట కాలువల్లోకి వదులుతున్నారు. దీనివల్ల పంట కాలువలు విపరీతమైన కాలుష్యానికి గురౌతున్నాయి. ఆక్వా సాగు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఈ సమస్య మరింతత తీవ్రమైంది. అనేక గ్రామాల్లో రైతులు రోడ్డెక్కడానికి కారణమైంది. చేపలు, రొయ్యల చెరువులు త్రవ్వకంలో ప్రభుత్వ బాధ్యతారాహిత్యం, యజమానుల పెత్తనానికి అదుపు లేకుండా పోయింది. ఈ పరిణామాలు అనేక సామాజిక సమస్యలకు కారణమవుతున్నాయి. కనుక వెంటనే అక్రమ త్రవ్వకాలను నిలిపివేయాలి, పర్యావరణాన్ని కాపాడాలని కోరుతున్నాను.

***అభివందనములతో...***

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి